# గోరంత దీపము

**సీతాకోక చిలుక** వేసవికాలం సింగారించుకోవడంతో, సంగీత కాలక్షేపంతో గడిపేసింది. ఒక్కక్షణమైనా వానాకాలం గురించి ఆలోచించలేదు.

వానాకాలం వచ్చేసింది.

చీమలు వేసవికాలంలో సంపాదించి దాచుకున్న ఆహారాన్ని ఆరబెట్టుకుంటున్నాయి. సీతాకోక చిలుక ఎక్కడ తిరిగినా ఆహారం దొరకలేదు. వానాకాలంలో ఎటుపోయినా అంతా ఖాళీ. ఆకలితో నకనకలాడుతూ చీమలవద్దకు వచ్చింది. "కాస్త తిండిపెట్టండి" అని ప్రాధేయపడింది.

"వేసవికాలంలో తిండి ఎందుకు కూడబెట్టుకోలేదు?" అని అడిగాయి చీమలు.

తానేదో నిర్వాకం చేసినట్టుగా, "సంగీత కాలక్షేపంతో నాకు తీరికే లేకపోయింది" అంది సీతాకోక చిలుక!

"ఐతే—చూడు, తల్లీ! వేసవికాలంలో సంగీతం పాడుకుంటూ కూర్చుంటే, వర్షాకాలమంతా ఆకలితో కూర్చోవడం మరీ మంచిది" అన్నాయి చీమలు. మళ్లీ సీతాకోకచిలుకవైపు చూడకుండా తమ పనిపాటలు చూసుకొన్నాయి.

'ముందు జాగ్రత్త లేనట్టి మందబుద్ధి
ముప్పు తిప్పలు పొందక తప్పదవని!'

* * *

**అభిమాన ధనులు** రసపుత్రులు. పౌరుషానికి పెట్టింది పేరు. ఒకసారి రసపుత్రులకూ, సుల్తానులకూ భయంకర యుద్ధం జరిగింది. విజయం సుల్తానులను వరించింది.

ఏడువందలమంది సైనికులతో సహా రసపుత్ర వీరుణ్ణీ, అతని ఐదేళ్ల పుత్రుణ్ణీ బందీ చేసి సుల్తాను విజయగర్వంతో నగరం చేరుకొన్నాడు.

రోజుకొక వంద సైనికులను రసపుత్ర వీరుని ఎదటే నిలబెట్టి చిత్రవధ చేయించాడు సుల్తాను. వారంరోజులైన తర్వాత తండ్రీ కొడుకులు ఇద్దరే మిగిలారు.

సుల్తాను వారిని దర్బారుకు రావించాడు. సంకెళ్లు ఊడదీయించాడు. రసపుత్ర వీరుణ్ణి మర్యాదగా పలకరించాడు.

"అరే, భాయీ! జరిగిందేదో జరిగింది! మీకూ, మాకూ వైరం వద్దు. ఒక్క షరతు మీద మీ తండ్రీ కొడుకులను వదిలేస్తాం. మీ సంస్థానం మీకు అప్పచెబుతాం" అన్నాడు సుల్తాను.

రసపుత్ర వీరుడు మాట్లాడకుండా ఒక్క చిరునవ్వు నవ్వాడు. సుల్తాను కూడా మందహాసంతో గడ్డాన్ని సవరించుకున్నాడు. కైజారు తీసి రసపుత్ర వీరునికి అందిస్తూ, "నీ శిరోజాలోనుంచి గుప్పెడు కత్తిరించి మాకిస్తే మీకు స్వేచ్ఛ లభిస్తుంది" అన్నాడు సుల్తాను.

రసపుత్రవీరుని పెదవులమీది చిరునవ్వు అలానే ఉంది. "మీరు మా శిరోజాలనే అడిగారు. కాని మేము మా శిరస్సులనే దానం చేస్తాము" అన్నాడు.

సుల్తాను గుండె భగ్గుమంది. తనను నిలువునా అవమానిస్తున్నాడీ రసపుత్ర వీరుడు!

"ఐతే జరిగేదేమిటో తెలుసా?" అని అడిగాడు సుల్తాను.

"ఆ. బాగా తెలుసు" అంటూ వీరుడు తన ఐదేళ్ల కుమారుణ్ణి కౌగలించుకున్నాడు. చెవిలో గుసగుసలాడుతూ, "నాయనా! భయపడుతున్నావా?" అని అడిగాడు.

"లేదు, నాన్నా! సింహానికి సింహమే పుడుతుంది" అన్నాడు వీరుని కొడుకు బాలవీరుడు.

మరు నిమిషంలో వీరుని చేతి కైజారు కుమారుని గుండెలో దిగబడింది. చిమ్మనగ్రోవి చిమ్మినట్లు నెత్తురు చిమ్మింది. తండ్రినెత్తురూ, కుమారుని నెత్తురూ కలిసిపోయాయి. సుల్తాన్ కళ్ళు పేలిపోయాయి. బంగారు గద్దె పగిలిపోయింది.

'ఆత్మధనుల పౌరుషాగ్ని కీలల జొచ్చి
దుర్మదాంధులు నుసి దొరువులైరి!'

* * *

**ఒకరాత్రి** జంగురు బిల్లి కోళ్లగూటిలో దూరి పుంజును పట్టుకుంది.

"నువ్వు రాత్రిళ్లు మనుషులను హాయిగా నిద్రపోనివ్వకుండా కూస్తుంటావు. నీ కూతలవల్ల నిద్రచెడి మనుషులు రోగాల పాలవుతున్నారు. అందుచేత నిన్ను చంపడం, తినడం సబబైన విషయం. పైగా ధర్మం, పుణ్యం కూడా" అన్నది జంగురుబిల్లి పుంజుతో.

పుంజు గిలగిలలాడుతూ,ఏడుస్తూ, "అయ్యో, నేను వారిని సకాలంలో మేల్కొలుపుతాను. అందుచేత వారి వారి పనిపాటలు సక్రమంగా జరుగుతుంటాయి. నా కూతలవల్ల వారికి మేలే కానీ కీడు లేదు" అంటూ వాపోయింది.

జంగురుబిల్లి చిరాకు పడుతూ, "నేను నీ జవాబేమిటని అడగలేదు. నీవు ఎంత ఏడ్చినా, నా పొట్ట నకనకలాడుతోంది కనక....." ఆ పై మాట పూర్తిచేయకుండానే జంగురుబిల్లి పుంజును చంపేసింది, తిన్నది కూడా.

ఇంతకూ చెప్పవచ్చిందేమంటే—

'పరుల నణచువాడు వల్లమాలిన నీతి
బోధ చేయుచుండు బుద్ధిమాలి!'

* * *

**యుద్ధంలో** భర్త మరణించాడు. పసిబిడ్డ కోసం ప్రజల ప్రార్థనపై ప్రతిమాదేవి సంస్థానాన్ని పాలిస్తున్నది. ప్రతిమాదేవి రసపుత్ర వనిత.

మరునాడే హోళీపండుగ. సంస్థానమంతటా మహోత్సవం జరగబోతున్నది. ఆ రాత్రి సుల్తాను మహాసైన్యంతో సంస్థానాన్ని చుట్టుముట్టాడు. అతనిది అపారమైన సైన్యం. సంస్థానమా—చాలా చిన్నది. "ఆడది ఆడడానికి, పాడడానికి పనికొస్తుంది—కానీ పరిపాలించడానికి పనికిరాదు" అన్నాడు సుల్తాను.

హోళీ పండుగరోజు ఉదయాన, సంస్థానం భయాందోళనతో ఉద్రిక్తమయింది.

సుల్తాను రాయబారం పంపాడు. "రాణీవారు మా నెలవుకు వచ్చి, మంచి చెడ్డలు మనవి చేసుకొంటే మన్నిస్తాము. పండుగనాడు ఖుషీకోరతాం కానీ, రక్తపాతం కోరబోము" అని ఆ రాయబారం.

మరో గడియకు రాణి దగ్గరనుంచి జవాబు వచ్చింది—"సుల్తానువారు ఆశ్రితులతో వసంతోద్యానవనానికి దయచేయాలి. రాణీవారు తమ దాసీజనంతో అక్కడికి వస్తారు. అక్కడే హోళీ ఉత్సవం జరుగుతుంది" అని.

సుల్తానువారు పొంగిపోయారు. 'ఎండ కన్నెరుగని రసపుత్ర వనితలు నేటికి కంటబడుతున్నారు. కనిపించడానికి, కౌగలించుకోవడానికి అభ్యంతరం ఎక్కడా లేదు' అనుకొన్నాడు. సైన్యాన్ని దూరంగా పంపాడు. తను ఐదువందలమంది ముఖ్యులతో వసంతోద్యానవనం చేరాడు.

వెన్నెలరాత్రి. ఐదువందల పల్లకీలు బంగారు జరీతెరలు వేలాడుతుండగా వనంచేరాయి. సుల్తాను సైనికులు ప్రతి పల్లకినీ తెరలు తొలగించి చూశారు. కన్ను చెదిరే సౌందర్యంతో, మిలమిలలాడే దుస్తులతో, వసంతోత్సవ పరికరాలతో రసపుత్ర వనితలు కనిపించారు.

సుల్తాను పరివారంవారు పూర్తి నమ్మకంతో ద్రాక్షారసం సేవించారు. మత్తిల్లారు. ఐదువందల రసపుత్ర వనితల వసంత నృత్యం ప్రారంభమయింది. చిమ్మనగ్రోవినుంచి ఎర్రరంగు నీరు లేస్తున్నది. పావడాల గిరగిర తిరుగుతున్నాయి. రసపుత్ర వనితల కళ్లు ఎర్రనై, రక్తం చిమ్ముతున్నాయి.

సుల్తానూ, పరివారమూ పూర్తి మైకంతో లేచి ఆ వనితలను చెరబట్టాలని చూశారు. ఒక్కసారి మంగళవాద్యాలు రణభేరులైనాయి. చిమ్మనగ్రోవులు చురకత్తులైనాయి. గాగరాలు జారిపోయాయి. వాళ్లు వనితలు కారు; వేషం ధరించిన యోధులు. సుల్తాను, పరివారము నెత్తుట మునిగి తేలారు. శత్రురక్తంతో హోళీపండుగ ముగిసింది. జరిగిందేమిటో సైన్యానికి చెప్పడానికి ఒక్కడూ మిగల్లేదు.

'మావటీడు నడుపు, మదగజమును కూడ
చిన్నయంకుశమును చేతబట్టి.' ★

నార్ల చిరంజీవి